
సాక్షి ఖమ్మం
సోమవారం ; 14 ; జూలై ; 2025



గొర్రెల్లో 'నీలి నాలుక'

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గొర్రెలకు నీలి నాలుక(బ్లూటంగ్) వ్యాధి సోకుతున్నట్లు పశు సంవర్థక శాఖ అధికారులు గుర్తించారు. 8లో



.. కార్మికుల చార్జీలు పెంపు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కార్మికుల చార్జీలు ఈనెల 22 నుంచి 13 శాతం పెంచాలని అధికారులు నిర్ణయించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం చిరు జల్లుల పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కొత్త పరికరాలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త పరికరాలు చేరుకున్నాయి. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో స్లాట్ విధానం అమలు చేస్తుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా ముగించేలా కొత్త కంప్యూటర్‌లు, స్కానర్‌లు, బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ పరికరాలు వచ్చాయి. పాత వాటితో రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతుండగా కొత్త పరికరాలు సరఫరా చేశారని, వాటిని ఆయా కార్యాలయాల్లో అమర్చామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

- రజత పతకం సాధించిన మల్లెమడుగు విద్యార్థినులు



సాధించిన మెడల్‌తో విద్యార్థినులు

ఖమ్మంఅర్బన్ : మంచిర్యాల జిల్లా రామకృష్ణాపురంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మల్లెమడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాట్లారు. కె.అనిత, టి. నవ్యశ్రీ రజత పతకం సాధించారు. గతేడాది వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అనిత కాంస్య పతకం సాధించిందని, హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకుందని ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణవేణి, పీడీ బియ్యని కృష్ణయ్య వివరించారు. కాగా, ఈ విద్యార్థినులను ఎంఈఓ శైలజలక్ష్మి తదితరులు అభినందించారు.

ప్రొఫెసర్‌కు సేవా జ్యోతి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనా శాస్త్రం, హెచ్‌ఆర్‌ఎం ప్రొఫెసర్, మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు ఏపీలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి సేవా జ్యోతి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆదివారం అందుకున్నారు. దివ్యాంగుడైన శ్రీనివాసరావు అంగవైకల్యం గల వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్నారు. ఆయనకు అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.

ముందుగానే సాగర్ జలాలు..

ఖమ్మంఅర్బన్ : జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టు రెండోజోన్‌కు ఈ ఏడాది ఖరీఫ్ పంటలకుగాను సాగర్ జలాలు దాదాపు నెల రోజులు ముందుగానే విడుదల కానున్నాయి. గతేడాది రెండో జోన్‌కు ఆగస్టు 3న నీరు విడుదల చేశారు. అయితే ఈ సంవత్సరం రైతుల అవసరాలు, డ్యామ్‌లో నీటి నిల్వలు, వరదల ప్రవాహం దృష్ట్యా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారమే నీరు విడుదల చేయనున్నారు. సాగర్ ప్రాజెక్టు ప్రారంభంలోనే వేసిన డిజైన్ ప్రకారం.. జోన్-1కు జూలై 10, జోన్ -2కు ఆగస్టు 10, జోన్ -3కు నవంబర్ 15 తేదీల్లో నీరు విడుదల చేయాల్సి ఉండగా రైతుల అవసరాల మేరకు ముందుగానే అందిస్తున్నారు.

'కోటా'కు జిల్లాతో ప్రత్యేక అనుబంధం

ఖమ్మంగాంధీచౌక్ : సినీ నటుడు కోటా శ్రీనివాసరావుకు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఖమ్మానికి చెందిన డాక్టర్ నాగబత్తిని రవి 1988లో నిర్మాతగా పనిచేసిన ఊరేగింపు సినిమాలో కోటా మంత్రిగా నటించారు. ఆయన నటించిన మరికొన్ని సినిమా షూటింగ్‌లు కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగాయి. ఖమ్మంతో పాటు భద్రాచలం, పాల్వంచ ప్రాంతాలతో కూడా ఆయనకు అనుబంధం ఉన్నట్లు కళాకారులు చెబుతున్నారు. 83 ఏళ్ల శ్రీనివాసరావు ఆదివారం మరణించగా జిల్లా వాసులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, కార్యదర్శి వేల్పుల విజేత, ఆర్క్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్ రావు, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

సాగు సమస్యకు చెక్!

పంటలకు నిరంతర విద్యుత్ సరఫరా..

- డిమాండ్‌కు తగ్గ సరఫరాకు డిస్కమ్‌ల కసరత్తు
- విద్యుత్ ఆధారంగానే అధికంగా పంటలు
- వ్యవసాయ సీజన్‌లో మరింతగా పెరగనున్న వినియోగం



నీళ్లు పోస్తున్న బోరు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. వేసవిలో గృహావసరాలకు అధికంగా వాడగా.. వానాకాలంలో వ్యవసాయ పనులు జోరందుకుంటే విద్యుత్ వినియోగం మరింతగా పెరగనుంది. డిమాండ్‌కు తగిన సరఫరా చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధమవుతున్నాయి. సాగుకు ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సాంకేతిక పరమైన మార్పులకు విద్యుత్ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు.. సరఫరాకు అంతగా వ్యత్యాసం లేకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంతో ఈ వానాకాలంలో జలాశయాల్లో కొంత నీరు తగ్గినా వ్యవసాయ బోర్లతో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు వరద వస్తుండగా ఈ నెలాఖరు నాటికి ప్రాజెక్టు నిండుతుందనే ఆశతో ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. దీంతో వానాకాలం సాగుకు నీళ్లు ఎలాగైనా వస్తాయనే నమ్మకంతో బోర్లు, బావుల కింద వరి నార్లు పోస్తున్నారు. నాన్ ఆయకట్టులో బోర్లు, బావుల కింద ముమ్మరంగా సాగు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో రెండు నెలల పాటు విద్యుత్ డిమాండ్ పెరగనుంది.

వేసవి తాపంతో..

జిల్లాలో 4,97,098 గృహ సర్వీసులు ఉన్నాయి. ఈ సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతోంది. వేసవి కాలంలో గృహావసర విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. రోజుకు 40-45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం అధికమై విద్యుత్ డిమాండ్ పెరిగింది.

ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ సర్వీసుల సంఖ్య

వ్యవసాయ సర్వీసులు	గృహ సర్వీసులు	పరిశ్రమలు, ఇతర కనెక్షన్లు	మొత్తం
1,20,246	4,97,098	81,225	6,98,569

జూలైలో డిమాండ్‌కు తగినట్లుగా..

ఇక వానాకాలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో మళ్లీ విద్యుత్ డిమాండ్ ఊపందుకుంటుందని డిస్కమ్ అంచనా వేసింది. గతేడాది జూలై కోటా 142.91 మిలియన్ యూనిట్లు కాగా.. 148.59 మిలియన్ యూనిట్లు వినియోగించారు. ఒక రోజు కోటా 4.61 మిలియన్ యూనిట్లు ఉండగా.. 4.79 మిలియన్ యూనిట్ల వరకు వాడారు. ఈ ఏడాది జూలైలో కోటా 149.11 మిలియన్ యూనిట్లు కాగా.. ఇప్పటి వరకు 38.31 మిలియన్ యూనిట్లు వాడారు. ప్రస్తుతం రోజు వారీ కోటా 4.81 ఎం.యూ ఉండగా.. 4.78 మిలియన్ యూనిట్లు వాడుతున్నారు.

రానున్న కాలంలో మరింతగా..

ఈ ఏడాది ఇంకా వ్యవసాయ సీజన్ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. దీంతో విద్యుత్ వినియోగంలో డిమాండ్‌కు, సరఫరాకు మధ్య అంతగా వ్యత్యాసం లేదు. అయితే వరి సాగు పెరిగి నీటి అవసరాలు అధికమైతే విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడనుంది. ఇప్పుడిప్పుడే రైతులు వరినార్లు పోస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో కురవకుంటే విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ అంచనా వేస్తోంది. వ్యవసాయ అవసరాలకు తగినట్లుగా సరఫరా పెంచేలా చర్యలు చేపడుతోంది.

పెరిగిన కనెక్షన్లకు అనుగుణంగా..

ప్రతీ ఏడాది వ్యవసాయ కనెక్షన్ల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ కనెక్షన్ల కోసం 1,866 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 1,206 మందికి కనెక్షన్లు ఇచ్చారు. మరో 660 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న కనెక్షన్లు కాకుండా అదనంగా వచ్చిన సర్వీసులకు ఎన్ని మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుందో అంచనా వేసి ఆ మేరకు ఉత్పత్తిపై డిస్కమ్‌లు దృష్టి పెట్టాయి.

ఇబ్బందులు లేకుండా..

వ్యవసాయ అవసరాలకు కోతల్లేని విద్యుత్ సరఫరా అందించాలి. పొలానికి నీరు పెట్టిన సమయంలో అరగంట తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోతే తడిసిన పొలం వల్ల కూడా ఉపయోగం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆ శాఖ వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తోంది. సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 18 వరకు సబ్ స్టేషన్లు ఏర్పాటుచేసిన అధికారులు.. విద్యుత్ లైన్ల మార్పుతోపాటు వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే అధికారులకు సమాచారం అందిస్తే పరిష్కరించేలా టోల్‌ఫ్రీ నంబర్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో వానాకాలంలో వ్యవసాయ పనులకు ఇబ్బందులు లేకుండా ఉండనున్నాయి.

విద్యుత్ బోరు ఆధారంగా సాగు..



వ్యవసాయ విద్యుత్ బోర్ల సాయంతో ఐదెకరాల్లో వరి పంట వేశా. ఈ మధ్య కాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఇస్తున్నారు. లోవోల్టేజీ తదితర ఇబ్బందులు కూడా తలెత్తడం లేదు. సబ్‌స్టేషన్లలో ఫీజులు పోయినా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి సమస్య పరిష్కరిస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పొలాలకు నిరంతరం నీరందుతోంది. – నేరడి బిక్షం, ఎదుళ్ల చెరువు, తిరుమలాయపాలెం మండలం

నేటి నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- రాష్ట్రంలో 3.54 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు
- పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్కరికీ ఇవ్వలేదు
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

నేలకొండపల్లి : రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి సోమవారం శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 3.54.లక్షల కుటుంబాలకు కార్డులు ఇవ్వనుండగా.. సీఎం రేవంత్‌రెడ్డి నేడు పంపిణీని ప్రారంభిస్తారని వెల్లడించారు. మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన.. సుర్దేపల్లి నుంచి బోదులబండ వరకు తాగునీటి పైపులైన్ నిర్మాణానికి, కోనాయిగూడెంలో సీసీ రోడ్లకు, మంగాపురంతండాలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లలా నడిపిస్తోందని, హామీల అమలుకు సిద్ధంగా ఉందని అన్నారు. అర్హులందరికీ నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. నాటి ప్రభుత్వం వరి వేస్తే ఉరి అంటే తమ సర్కారు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని, తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. త్వరలోనే కృష్ణా జలాలు వస్తాయన్నారు. కోనాయిగూడెంలో పెసర పంటను పరిశీలించి సాగు వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. వరి నాట్లు వేసే కూలీల వద్దకు వెళ్లి వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు.

కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకుల శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, అంజిని, రావెళ్ల కృష్ణారావు, బోయిన వేణు, బచ్చలకూరి నాగరాజు, గుండా బ్రహ్మం, యడవల్లి నాగరాజు, రాయపూడి నవీన్, పెంటమళ్ల పుల్లమ్మ, బొందయ్య, కొమ్మినేని పుష్పావతి, పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన భద్రగిరి



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీసీతారామచంద్ర స్వామివారికి అభిషేకం, సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రగిరి ఆదివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో భక్తులు భద్రాచలం బాట పట్టారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్లలో బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం తదితర పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రద్దీ ఉండటంతో పట్టణంలో ప్రైవేట్ లాడ్జీలలో, దేవస్థానం వసతి గృహాల్లో గదులు దొరకక భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

రామయ్యకు వైభవంగా కల్యాణం

అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు.

కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ఈ ఏడాదీ ఇక్కట్లే!

పాలేరు నియోజకవర్గానికి మంజూరైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఈ ఏడాది కూడా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నియోజకవర్గ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. అనంతరం కళాశాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రూ.108.64 కోట్లు మంజూరు చేయించారు. – ఖమ్మంరూరల్

- ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ భవనానికి రూ.108.64 కోట్లు
- మంత్రి పొంగులేటి చొరవతో మంజూరైనా నిర్మాణంలో జాప్యం
- రీ టెండరింగ్‌తో పనులు ఆలస్యం?
- మరో ఏడాది గడిస్తేనే సొంత భవనం



వైటీసీ భవనంలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాల

2023లో తరగతులు ప్రారంభం..

ఇంజనీరింగ్ కళాశాల మంజూరైనప్పటికీ శాశ్వత భవనాలు లేకపోవడంతో మొదటి ఏడాది బారుగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలను అద్దెకు తీసుకుని నడిపించారు. అక్కడ అద్దె రూ.లక్షల్లో ఉండడంతో మద్దులపల్లిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ వైటీసీ భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఈసీఈ, సీఎస్‌సీ, ఈఈఈ, సీఎస్‌డీ, మెకానికల్ బ్రాంచ్‌లలో తరగతులు నిర్వహిస్తుండగా ఒక్కో విభాగంలో 66 మంది చొప్పున మొత్తం 330 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించారు. అయితే 2023 - 24లో మొదటి బ్యాచ్ ప్రారంభం కాగా 150 మంది ప్రవేశం పొందారు. 2024 - 25లో 160 మంది జాయిన్ అయ్యారు. 2025 - 26 బ్యాచ్‌లో ఇంకా 300 మంది వరకు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 310 మంది విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 9 మంది ఉద్యోగులు పని చేస్తుండగా అందులో ముగ్గురు బోధనేతర సిబ్బంది ఉన్నారు.

30 ఎకరాలు.. రూ.108.64 కోట్లు

మద్దులపల్లి పరిధిలో ప్రభుత్వానికి చెందిన 30 ఎకరాల్లో నూతనంగా ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.108.64 కోట్లు మంజూరు చేసింది. మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భూమి, నిధుల కేటాయింపునకు సహకరించారు. దీంతో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ల్యాబ్‌లు, తరగతి గదులు, అధ్యాపకుల గదులతో సువిశాలంగా నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఏటా పెరుగుతున్న ప్రవేశాలు..

ఇప్పటివరకు వైటీసీలో తరగతులు నిర్వహిస్తున్నా.. ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో ఆ భవనాల్లో తరగతుల నిర్వహణ కష్టమనే భావన వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు రెట్టింపుగా ఎంసెట్, పీసెట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సులో చేరవచ్చని అంచనా. దాదాపు కొత్తగా ప్రథమ సంవత్సరంలో అయిదు బ్రాంచ్‌ల్లో కలిపి మరో 300 మంది చేరే అవకాశం ఉండగా అప్పుడు మొత్తం విద్యార్థుల సంఖ్య 600 వరకు ఉంటుంది. వీరందరికీ ప్రస్తుత భవనాల్లో బోధన చేయడం కష్టమే. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు త్వరగా ప్రారంభించి కొత్త భవనాలు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఏడాది కష్టమే..

నిధులు మంజూరైనా ఇంత వరకు పనులు ప్రారంభించకపోవడంతో ఈ ఏడాది ప్రభుత్వ భవనాల్లో తరగతుల నిర్వహణ కష్టమేనని తెలుస్తోంది. పనుల నిర్వహణకు మార్చిలో మొదటిసారి టెండర్లు ఆహ్వానించారు. దీంతో పనులు చకచకా సాగి ఈ ఏడాది అందుబాటులోకి వస్తుందని అంతా ఆశించారు. అయితే కారణం తెలియదు కానీ.. ఆ టెండర్లు రద్దు చేసి మళ్లీ ఆహ్వానించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇలా పనుల్లో రోజురోజుకూ జాప్యం జరుగుతుండడంతో సొంత భవనంలో తరగతుల నిర్వహణ ఎప్పుడోనని విద్యార్థులు వేచిచూస్తున్నారు.

అమ్మవారికి ఆషాఢ బోనం



ఖమ్మం నగరంలో బోనాలతో తరలివెళ్తున్న మహిళా భక్తులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బోనాల సందడి నెలకొంది. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో శ్రీ కనకదుర్గమ్మ, పెద్దమ్మతల్లి, గంగానమ్మ తల్లి, పోచమ్మ తల్లి అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఖమ్మం నగరంతో పాటు తల్లాడ, చింతకాని, కారేపల్లి, వైరా తదితర మండలాల్లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

- వివరాలు 9లో

నగరాలు, పట్టణాలకు నిధులు..

- కార్పొరేషన్, మున్సిపాలిటీలకు విడుదల చేస్తూ జీఓ
- స్వచ్ఛభారత్ మిషన్ కింద మంజూరు
- టాయిలెట్లు, భవనాల నిర్వహణకు వినియోగం
- కేఎంసీకి రూ.3.71 కోట్లు..



ఖమ్మంమయూరిసెంటర్ : నిధులు లేక నిర్వహణలో ఇబ్బంది పడుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. నగరాలు, పట్టణాలకు స్వచ్ఛభారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల చేస్తూ సీడీఎం, స్టేట్ మిషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో టాయిలెట్లు, భవనాల నిర్వహణ, బయోమైనింగ్ పనులకు ఈ నిధులను వినియోగించుకునేలా వీలు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మధిర, మణుగూరు, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు మున్సిపాలిటీలకు ఈ నిధులు విడుదల చేశారు. పాల్వంచ మున్సిపాలిటీ కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ఆ పట్టణ నిధులను కూడా కొత్తగూడెం కార్పొరేషన్‌కు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా కేటాయించిన నిధులు(రూ.ల్లో) ..

ఖమ్మం కార్పొరేషన్	3,71,38,950
కొత్తగూడెం కార్పొరేషన్	99,17,851
మధిర	6,11,112
మణుగూరు	5,86,721
సత్తుపల్లి	6,13,720
వైరా	5,72,508
ఇల్లెందు	8,17,360

మెరుగుపడనున్న సౌకర్యాలు..

మున్సిపాలిటీలకు సరైన నిధులు లేక, ఆదాయం రాక కార్యాలయ భవనాల నిర్వహణ, టాయిలెట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయ వనరులు తగ్గడంతో మున్సిపాలిటీలపై భారం పెరిగింది. ఈ తరుణంలో ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిధులు విడుదల చేయడంతో మున్సిపాలిటీల్లో సౌకర్యాలు మెరుగయ్యే అవకాశం ఉంది.

బయోమైనింగ్‌కు నిధులు..

పట్టణాలు, నగరాలు విస్తరిస్తుండడం, జనాభా పెరగడంతో వ్యర్థాల నిర్వహణ మున్సిపాలిటీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యర్థాల డంపింగ్ పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు కేఎంసీ అధికారులు బయోమైనింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేస్తున్నారు. బయోమైనింగ్ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.3.71 కోట్లుకు పైగా ఎస్‌బీఎం కింద నిధులను కేటాయించగా.. ఇందులో రూ.3,35,62,783 బయోమైనింగ్‌కు కేటాయిస్తు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.99.17 లక్షల నిధులు విడుదల చేయగా.. బయోమైనింగ్ కోసం రూ.76,65,007 కేటాయించారు. ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.8,17,360 మంజూరు కాగా, బయోమైనింగ్‌కు రూ.1,36,924 కేటాయించారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓకు జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న వెంకటేశ్వరరావు

చింతకాని: మండలంలోని నాగులవంచ సమీకృత బాలుర వసతి గృహం సంక్షేమాధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సహాయ అధికారి (ఏఎస్‌డబ్ల్యూఓ), మధిర ఇన్‌చార్జ్ కొత్త వెంకటేశ్వరరావు తెలుగు వెలుగు జాతీయ గౌరవ పురస్కారాన్ని హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో శనివారం అందుకున్నారు. తెలుగు – వెలుగు సాహితీ వేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల అభ్యున్నతికి, సామాజిక సేవకు గాను ఆయనకు అవార్డు అందజేశారు. శ్రీ విశ్వ కళా విరాట్, బతుకమ్మ తల్లి గ్రంథకర్త, గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డాక్టర్ వంగాల శాంతికృష్ణ చేతుల మీదుగా ఆయన పీవీ నర్సింహారావు జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావును అభినందించారు.

యాప్ ఓపెన్ చేస్తే డబ్బులు మాయం

రఘునాథపాలెం: ఓ విద్యార్థి వాట్సాప్‌నకు వచ్చిన లింక్ ద్వారా యాప్ ఓపెన్ చేయగానే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు మాయం అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. కారేపల్లి మండలం కుక్కలతండాకు చెందిన అజ్మీరా సిద్ధార్థ రఘునాథపాలెంలో ఉంటున్నాడు. గత డిసెంబర్ 26న తన ఫోన్ వాట్సాప్‌నకు ఓ యాప్ మెసేజ్ వచ్చిందని దాన్ని ఓపెన్ చేయగానే తన ఖాతాలో నిల్వ ఉన్న నగదు రూ.70 వేలు పోయినట్లు మెసేజ్ వచ్చిందని, వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తే ఖాతాను హోల్డ్ చేశారని బాధితుడు తెలిపాడు. సైబర్ క్రైమ్ అధికారుల సూచన మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి తుమ్మలమ్మ వాగు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం నగరానికి చెందిన సుగుణకు తీవ్ర గాయాలయ్యాయి. సుగుణ కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఏపీలోని పెనుగంచిప్రోలు దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఖమ్మం వస్తుండగా తుమ్మలమ్మ వాగు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. సుగుణ తలకు తీవ్ర గాయాలు కావటంతో సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా, ఏఎస్‌ఐ లక్ష్మణ్ ఆమెను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ టీటీ కోచ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సాంబమూర్తి

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం హైదరాబాద్‌లో ఉత్తమ టేబుల్ టెన్నిస్ కోచ్‌గా జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ వీవీ సాంబమూర్తికి ఉత్తమ కోచ్‌గా అవార్డు అందించారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్న కోచ్‌గా సాంబమూర్తి నిలిచారు. ఆయనకు అవార్డు రావడంపై సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉప్పల్‌రెడ్డి, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, జంగాల సునీల్, శ్రీధర్, ప్రవీణ్‌కుమార్, చలపతి, షేక్ మజ్హార్, జోజిచాకో, రాజేశ్, రెడ్డిసాయి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



స్నానఘట్టాలపై చేరిన బురద

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరికి భారీ వరద వచ్చి తగ్గింది. సుమారు 42 అడుగులకు చేరుకోవడంతో స్నానఘట్టాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వరద తగ్గడంతో ఆదివారం కొంత మేరకు స్నానఘట్టాలపై నీరు తగ్గింది. కానీ బురద మిగిలిపోయింది. దీంతో స్నానాలు ఆచరించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడా భక్తులే బురదను తొలగించుకుని స్నానాలు చేశారు.

గొర్రెల్లో 'నీలి నాలుక'

- దోమల ద్వారా వ్యాధి వ్యాప్తి
- జీవాలకు ప్రాణాంతకంగా మారుతున్న రుగ్మత
- ముందస్తు గుర్తింపు, జాగ్రత్తలతోనే మేలు



వ్యాధి సోకడంతో సొంగ కారుస్తున్న గొర్రె



డాక్టర్ సీహెచ్ రఘుపతి

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి (బ్లూటంగ్) విజృంభిస్తోంది. జిల్లాలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ గుర్తించింది. దోమల వల్ల సంభవించే ఈ ప్రాణాంతక వ్యాధి వర్షాకాలంలో సోకుతుంది. వైరస్‌లతో కలిగే వ్యాధిని మూతి వాపు, పూత రోగం అని కూడా అంటారు. జిల్లాలో 6.67 లక్షల గొర్రెలున్నాయి. జీవాల పెంపకందారులు ఈ వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సీహెచ్ రఘుపతి ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

వ్యాధి వ్యాప్తి

నీలి నాలుక వ్యాధి.. కలుగజేసే వైరస్‌లు 'క్యూలికాయిడ్స్' అనే దోమకాటు ద్వారా జీవాల్లో ప్రవేశిస్తాయి. వర్షాకాలంలో ఈ వ్యాధి క్రిముల అభివృద్ధికి, అవి విస్తరింపజేసే దోమల వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెను దోమ కుట్టి అదే దోమ ఆరోగ్యవంతమైన గొర్రెను కుట్టడం వల్ల ఈ వ్యాధి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక్కసారిగా ఈ వ్యాధి సంభవించి, మరణాలకు దారితీస్తుంది. గొర్రెల కాపరులు వ్యాధిని గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

లక్షణాలు

- వ్యాధి సోకిన గొర్రెల్లో జ్వరం ఎక్కువగా (105 – 106 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత) ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి 3–8 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయట పడతాయి.
- వ్యాధి సోకిన 3వ రోజున గొర్రె నోరు, ముక్కుల లోపల ఎర్రగా కంది క్రమంగా పెదాలు వాస్తాయి. నోటి నుంచి చొంగకారుతుంది. క్రమంగా చొంగ చిక్కబడి ముక్కుల గుండా నీరుకారుతుంది. పొక్కులు ఏర్పడుతాయి.
- ముఖం, పెదవులు, దవడల మధ్య వాపు వస్తుంది.
- నోటి లోపల నాలుక ఎర్రబడి పైపొర లేచిపోయి పొక్కులుగా మారుతాయి.
- నాలుక నీలి రంగులోకి మారడం వల్ల నీలినాలుక రోగం అంటారు.
- వ్యాధి సోకిన వారం తరువాత గిట్టల పైభాగాన ఎర్రటి నెత్తురు చార కనిపించి గొర్రె కుంటుతుంది.
- ఆహారం తీసుకోకుండా క్షీణించి మరణాలు కూడా సంభవిస్తాయి.

నివారణ

- వ్యాధి తీవ్రతపై సూర్యరశ్మి ప్రభావం చూపుతుంది కాబట్టి వ్యాధిగ్రస్త జీవాలను నీడలో ఉంచి చికిత్స చేయించాలి. మంద నుంచి దూరంగా ఉంచాలి.
- దోమల నివారణకు వేపాకు లేదా నీలగిరి, కలబంద లేదా పిడకల్ని కాల్చాలి. రాత్రి వేళల్లో ఎలక్ట్రిక్ బల్బులు పెడితే దోమల ఉధృతి తగ్గుతుంది.
- గొర్రెల షెడ్లలో ఫ్యాన్లు, దోమతెరలను వాడాలి.

చికిత్స

- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి. యాంటిబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడటం ద్వారా గొర్రెలు చనిపోకుండా కాపాడుకోవచ్చు.
- వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించాలి. నోటిపుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లోషన్‌తో శుభ్రం చేసి వైద్యులు సూచించిన మందు పూయాలి.
- గొర్రెలకు రాగిజావ లేదా మొక్కజొన్న జావను ఉప్పు కలిపి తాగించాలి. లేత ఆకులను మేపాలి.
- 5 రోజుల పాటు ఒక్కో గొర్రెకు డాక్టర్ సలహాతో యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వేయాలి. నీరసించిన గొర్రెలకు గ్లూకోజ్ ఎక్కించాలి.
- కాలిగిట్టల మీద పుండ్లను కడిగి హిమాక్స్, నెమ్ లెంట్ వంటి ఆయింట్‌మెంట్లను పూయాలి.

వ్యాధి నివారణ చర్యలు

- గొర్రెల దొడ్లలో ఫినాయిల్, మలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులను చల్లాలి
- ఎండిన వేపాకు పొగ, యూకలిప్టస్ పొగను సాయంత్రం పూట వేయాలి.
- డాక్టర్ సలహాపై మందులు విధిగా వాడాలి.
- విటమిన్–సీ ఇంజక్షన్, పౌడర్‌ను వాడాలి. విట్–ఏ సిరప్‌ను వాడాలి.

మార్కెట్ కార్మికుల చార్జీలు పెంపు



ఖమ్మం మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులు

ఈ నెల 22 నుంచి 13 శాతం పెంపు అమలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కార్మికుల చార్జీలు 13 శాతం పెరిగాయి. రెండేళ్లకు ఒకసారి మార్కెట్ కార్మికుల రేట్ల పెంపుపై నూతన ఒప్పందం ఉంటుంది. కార్మిక సంఘాల ప్రతినిధులు పెరిగిన నిత్యావసరాలు, ఇతర అవసరాలకు అనుగుణంగా తమకు రేట్లు పెంచాలని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గానికి, ఖమ్మం మార్కెట్ కమిటీకి నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుల ఆధారంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ, చాంబర్ ఆఫ్ కామర్స్, రైతు సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. ఈ ఏడాది మిర్చి ధర తగ్గినందున కార్మికుల రేట్ల పెంపును విరమించుకోవాలని రైతు సంఘాలు ప్రతిపాదించాయి. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని కార్మికులు అభ్యర్థించిన రేట్ల పంపును పరిశీలించి 13 శాతం పెంచుతున్నట్లు నిర్ణయించారు. మార్కెట్‌లో హమాలీలు, దడవాయిలు, స్వీపర్లు, రెల్లుడు వంటి కార్మిక విభాగాలు పనిచేస్తాయి. ఆయా కార్మికులుకు గతంలో నిర్ణయించిన రేట్లపై 13 శాతాన్ని పెంచారు. పత్తి, పంటలు బోరాల్లో నింపితే అదనంగా చార్జి చెల్లించాల్సి ఉంటుంది. గింజలు పెట్టడం, ధాన ధర్మాలు(ముష్టి) వంటి విధానాలు పూర్తిగా నిషేధించారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ పర్యవేక్షణలో ఈ నూతన రేట్లు అమలు కానున్నాయి. రైతుల పంటను ఖరీదుదారులకు విక్రయించటంలో మధ్యవర్తులుగా వ్యవహరించే కమీషన్‌దారులు నూతన కార్మికుల రేట్లు అమలు చేయాల్సి ఉంటుంది. పెంచిన 13 శాతం రేట్లు మార్కెట్‌లో పనిచేసే సుమారు 2,500 మంది కార్మికులకు వర్తించే అవకాశం ఉంది.

పెరిగిన కార్మికుల రేట్లు ఒక బస్తాకు(రూ.లలో)

పంట	దిగుమతి	తట్టపోత	దడవాయి	రెల్లుడు	స్వీపర్	మొత్తం
అపరాలు	4.22	15.11	6.11	3.02	4.07	32.52
శనగకాయ	4.22	8.00	6.11	3.02	4.07	25.41
పత్తి, మిర్చి						
50 కేజీలలోపు	4.22	10.05	6.11	--	2.53	22.91
50 కేజీల పైన	4.22	15.11	6.11	--	2.53	27.97

గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బంజారులు మాట్లాడే గోర్‌బోలి భాషని అధికారికంగా గుర్తించి 8వ షెడ్యూల్లో చేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం మార్కెట్ యార్డ్‌లో లంబాడీ (బంజారా) సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని, ట్రైకార్ రుణాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. ఐటీడీఏల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వేంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న ప్రతీ చోట భగవాన్ హతీరామ్ బావాజి గుడి నిర్మించాలని డిమాండ్ చేశారు. టీటీడీ ట్రస్ట్ బోర్డు లాగే హతీరామ్ బావాజీ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రాజేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, బానోత్ రాములు నాయక్, హతిరామ్‌నాయక్, వీరూ నాయక్, వెంకట్ నాయక్, సీతారాంనాయక్, రవి నాయక్, లాల్ సింగ్ నాయక్, బాబులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ పరిధిలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉండే ఉపేందర్ (28) తన ఇంట్లో కుట్టుమిషన్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అతడిని బంధువులు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమకు ఇంకా ఫిర్యాదు రాలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

వైరారూరల్: మండలంలోని గొండ్లపాలం గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావుపై సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం–2007 సెక్షన్ 24 ప్రకారం కేసు నమోదు చేసినట్లు వైరా ఎస్‌ఐ రామారావు ఆదివారం తెలిపారు. శ్రీనివాసరావు తల్లి కొన్నేళ్ల కిందట మృతిచెందింది. తర్వాత కుమారుడు శ్రీనివాసరావు తండ్రి బొడ్డు బసవయ్య మంచి, చెడులు చూసుకోకుండా దూషించడం, కొట్టడం చేస్తుండడంతో బసవయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రామకృష్ణాపురం వాసులపై

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పోతు రాజు బాలకృష్ణ, యాదగిరిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వ్యవసాయ భూమి విషయంలో తలెత్తిన వివాదంలో ఖమ్మం నగరానికి చెందిన షేక్ సలీమ్‌పై వీరిద్దరూ కర్రలతో దాడిచేయగా గాయాలయ్యాయి. సలీమ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన విష్ణువర్ధన్

కారేపల్లి: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టంతో దంపతులకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని భాగ్యనగర్ తండాలో ఆదివారం చోటుచేసుకుంది. నెక్కొండ పట్టణానికి చెందిన విష్ణువర్ధన్, సహన దంపతులు ఇల్లెందులో నివాసం ఉంటున్నారు. వీరు ఇల్లెందు నుంచి ద్విచక్రవాహనంపై కారేపల్లి మీదుగా ఖమ్మం వస్తుండగా భాగ్యనగర్‌తండా వద్ద కుక్క అడ్డురావటంతో రోడ్డుపై కిందపడ్డారు. వెనుకాల ఉంచి ట్రాక్టర్ వచ్చి దంపతుల మీది నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. విష్ణువర్ధన్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్

చర్ల: ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ఆదివారం ఆయన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మితో కలిసి మండలంలోని ఉంజుపల్లి పల్లె దవాఖానాను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సికిల్ సెల్ ఎనీమియా, టీబీ ముక్త్ భారత్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, జ్వర పీడితుల గుర్తింపు తదితర వైద్య సేవలపై అధికారులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరన్, చర్ల ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ స్పందన, డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ తేజశ్రీ, ఉంజుపల్లి సబ్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీ మోదుగులగూడెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం పెనగడపకు చెందిన యోగేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. పెనగడప నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరిన యోగేంద్ర ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు 108లో యోగేంద్రను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

యువకుడు మృతి



వీరకుమార్ (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం చంద్రుతండాకు చెందిన బానోత్ వీరకుమార్ (26)వంట మాస్టర్‌గా, ర్యాపిడో బైక్ ట్యాక్సీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న ఉదయం ఇంటి నుంచి ఖమ్మం వెళ్లి పని ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో చింతపల్లి వద్ద వరంగల్ వైపు నుంచి ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బృందం సాయంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంజలి ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

నమ్మి వస్తే.. ప్రాణం తీశాడు..

- స్నేహితులతో కలిసి మహిళను హత్య చేయించిన వ్యక్తి
- సూర్యాపేట జిల్లా కిష్టారం అడవుల్లో ఘటన




హస్లీ (ఫైల్)

కొణిజర్ల: జీవితాంతం కలిసి ఉంటాడని నమ్మి భర్త పిల్లలను వదిలేసి వచ్చిన ఓ మహిళను.. ఆ వ్యక్తే స్నేహితులతో కలిసి హత్య చేసి, అడవిలో పడేశాడు. ఈ ఘటన మండలంలోని విక్రమ్‌నగర్‌లో విషాదాన్ని నింపింది. ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ కథనం ప్రకారం.. కామేపల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన భూక్యా మదన్ అదే గ్రామానికి చెందిన హస్లీతో వివాహేతర సంబంధం పెట్టుకుని అక్కడి నుంచి ఆమెను తీసుకుని కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్‌కు వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. హస్లీకి అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండగా కు.ని. చేయించుకుంది. దీంతో ఆమెకు పిల్లలు పుట్టరని మదన్ విక్రమ్‌నగర్‌కు చెందిన మరో మూగ యువతిని వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి హస్లీకి, మదన్ వివాహం చేసుకున్న యువతికి, ఆమె కుటుంబ సభ్యులకు తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎలాగైనా హస్లీ పీడ వదిలించుకోవాలనుకున్న మదన్ తన స్నేహితులు అయిన కొణిజర్లకు చెందిన చల్లా నాగేశ్వరరావు, బస్వాపురానికి చెందిన తమ్మిశెట్టి నరసింహారావు సహకారంతో హస్లీకి మాయమాటలు చెప్పి చేతబడులు చేయించే వారున్నారని, వారితో చేతబడి చేయించి మూగ యువతిని చంపిద్దామని చెప్పి సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చింతలపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ పసరు పేరుతో గుర్తు తెలియని విషం తాగించారు. ముగ్గురు కలిసి గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని అక్కడ పడవేసి గుట్టు చప్పుడు కాకుండా అక్కడి నుంచి ఇళ్లకు వచ్చేశారు. ఈ నెల 11న మహిళ అదృశ్యమైందని కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందగా.. తమకు మదన్ మీదనే అనుమానం ఉందని మృతురాలి కూతురు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సూరజ్ నేతృత్వంలో పోలీసులు మదన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తానే హత్య చేయించినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం ఆదివారం ఘటనా స్థలానికి తీసుకెళ్లి మృతదేహాన్ని చూపించాడు. ఎస్‌ఐ సూరజ్ ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం చేయించి మృతురాలి బంధువులకు అప్పగించారు. మదన్‌ను అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

చర్చి ఫాదర్ దుర్మరణం



వెంకటేశ్వరరావు(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు ఆర్వోబీపై కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చర్చి ఫాదర్ దుర్మరణం పాలైన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మీనవోలు గ్రామానికి చెందిన నండ్రు వెంకటేశ్వరరావు (50) అలియాస్ జ్ఞానప్రకాష్ మధిర పట్టణంలోని సెవెంత్ డే చర్చిలో ఫాదర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పెగళ్లపాడు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా పెగళ్లపాడు ఆర్వోబీపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి కారుడ్రైవర్, పెద్దగోపవరం గ్రామానికి చెందిన శీలం శివరామకృష్ణారెడ్డి పరారయ్యాడు. మధిర రూరల్ సీఐ మధు, ఎస్‌ఐ రమేశ్ చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేశారు. పోలీసులు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, బాబు ఉన్నారు. మృతుడి సోదరుడు దావీదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.